క్లుప్తంగా

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కమలాపురం : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం 1–19 ఏళ్ల పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు పెద్దచెప్పలి పీహెచ్‌సీ వైద్యాధికారిణి శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో 24 అంగన్‌వాడీ కేంద్రాలు, 25 పాఠశాలలు ఉన్నాయని, వాటిలోని 2159 మంది విద్యార్థులకు సరిపడ ఆల్బెండజోల్ మాత్రలు సరఫరా చేశామన్నారు. ప్రతి విద్యార్థి ఆ మాత్రలను తప్పని సరిగా మింగేటట్లు సంబంధిత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చూడాలని ఆమె తెలిపారు.

నేడు మండల సమావేశం

పెద్దముడియం : పెద్దముడియం మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సభా భవనంలో ఎంపీపీ కె.కె.సుధ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మి నరసింహ్మ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మండల సమావేశంలో వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ తెలియజేశారు.

గడ్డివామి దగ్ధం

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో చౌడం గంగాధర్‌కు చెందిన గడ్డివామి ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో దగ్ధమైంది. జమ్మలమడుగు అగ్ని మాపక సిబ్బంది వచ్చి ఇతర వాములకు వ్యాపించకుండా అదుపు చేశారు. గడ్డివామి విలువ రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

నేత్రదానం



కార్నియాలను సేకరిస్తున్న సేవా సమితి సభ్యులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని వెలమవారిపల్లె గ్రామానికి చెందిన మాడిశెట్టి రామమోహన్ (48) గురువారం గుండె పోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులు అంగీకరిస్తూ నేత్రదానానికి స్నేహిత అమృత సేవా సమితి అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇచ్చారు. వారు మృతుడి ఇంటి వద్దకు వచ్చి కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపినట్లు తెలిపారు. నేత్రాలను దానం చేసేవారు 9966509364,7093204537 నెంబర్లుకు సమాచారం ఇవ్వాలన్నారు.

కంపచెట్ల తొలగింపు



పొలాలకు వెళ్లే దారుల్లో ఉన్న కంపచెట్లు తొలగిస్తున్న జేసీబీ

కమలాపురం : మండల పరిధిలోని సి.గోప్పులాపురంలో ఎమ్మెల్యే సొంత నిధులతో కంప చెట్లు తొలగించారు. గురువారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ గ్రామ నాయకుడు మల్లికార్జునరెడ్డి పర్యవేక్షణలో జేసీబీ సాయంతో స్మశానంలో, స్మశానంకు వెళ్లే దారితో పాటు పంట పొలాలకు వెళ్లే దారుల్లో ఉన్న కంపచెట్లన్నీ తొలగించారు. ఎన్నో ఏళ్లుగా కంపచెట్లు మొలచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వాటిని తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులతో కంపచెట్లు తొలగించారు. దీంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

లింగ నిర్ధారణను నిషేధించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న శాంతికళ

జమ్మలమడుగు : ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యం లింగ నిర్ధారణను నిషేధించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులను ఆమె తనిఖీ చేసి ఆసుపత్రుల్లో జరిగిన ఆపరేషన్లు, ప్రసవాలను గురించి ఆరాతీశారు. ఆడపిల్లలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అబార్షన్‌ల కోసం వచ్చే వారికి భవిష్యత్తులో జరగబోయే నష్టాల గురించి వివరించాలన్నారు.

అసత్య ప్రచారాలపై చర్యలు తప్పవు

కడప అర్బన్: కడప నగరంతో పాటు, సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా సరే సోషల్ మీడియాను వేదికగా చేసుకుని అసత్య ప్రచారాలను చేస్తే వారిపై చర్యలు తప్పవని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ హెచ్చరించారు. గురువారం కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీడియా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తాము చేసే ప్రచార సంఘటనల ద్వారా ప్రజలు భయాందోళనకు గురికాకుండా చూడాలని ఆయన సూచించారు.

సంక్షేమ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలుద్దాం



ఎర్రగుంట్లలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి



పులివెందులలో పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఎం సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక 9వ వార్డులోని వేంపల్లి రోడ్డు, పుష్పగిరి కాలనీలలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డితో కలసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకంటే ప్రజలకు ఎక్కువ మేలు చేకూర్చి రాష్ట్రాన్ని వైఎస్ జగన్ అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. ప్రస్తుతం అర్హత కలిగిన వారందరికీ స్థలాలిచ్చి సొంతింటి కలను సాకారం చేశారన్నారు. జగనన్నను నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ప్రజలను ఎమ్మెల్యే కోరారు. అలాగే కాలు విరిగి ఇంటి వద్ద ఉన్న సీనియర్ పాత్రికేయుడు సదాశివారెడ్డి ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటలక్షుమ్మ, పార్టీ నాయకులు గంగాధర్‌రెడ్డి, జెక్కు చెన్నకృష్ణారెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, వార్డు నాయకులు, కార్యాకర్తలు పాల్గొన్నారు.

మంచి జరిగి ఉంటేనే మరో అవకాశం కల్పించండి

జమ్మలమడుగు : సంక్షేమ పథకాల వల్ల ప్రజలు లబ్ధిపొంది ఉంటే వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రజలను కోరారు. గురువారం పట్టణంలోని 14 వార్డులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ప్రజల వద్దకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఎంపికైన నాటి నుంచి ఇప్పటి వరకు చిన్న చిన్న ఘర్షణలు కూడా నియోజకవర్గంలో జరుగలేదన్నారు. తాను ప్రజలు ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటానన్నారు. టీడీపీ పాలనలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు చేసిన మోసాలు, ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునే అవకాశం ప్రజలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, కౌన్సిలర్ లక్ష్మీపుల్లమ్మ, వేణు, బడిగించల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

పులివెందుల టౌన్ : అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే సీఎంగా జగనే ఉండాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం పెద్దరంగాపురం సచివాలయ పరిధిలోని వాసవీకాలనీ, జయమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పథకాలు అన్ని వస్తున్నాయా అని ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పథకాలు అమలు చేసి ప్రజల మనస్సును గెలిచారన్నారు. చెప్పిన వాటికన్నా ఎక్కువ పథకాలు అమలుచేశారన్నారు. రాష్ట్ర అభివృద్ధి పథంలో నడవాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలన్నారు. ప్రతి ఒక్కరు తమ ఓటుతో జగనన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజుల్లా, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిషోర్, చంద్రమౌళి, కౌన్సిలర్ కోడిరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



చెన్నూరులో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి



పెండ్లిమర్రి : మాచునూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న మండల కన్వీనర్ చంద్రారెడ్డి

రాష్ట్రాభివృద్ధి వైఎస్ జగన్‌తోనే సాధ్యం

పెండ్లిమర్రి : రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మాచునూరు గ్రామ పంచాయతీలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్టీ నేతలతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని వివరిచారు. ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలన్ని కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే సీఎం చేసుకోవాల్సి అవసరం ఎంతైన ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలను గెలిపించాలని పిలువు నిచ్చారు. ఎంపీపీ వరలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, జెసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ లావణ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, ఆనంద్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, పుల్లారెడ్డి, కృష్ణారెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ పోచంరెడ్డి నరేన్ రామాంజులురెడ్డి ప్రజలను కోరారు. గురువారం ఆయన స్థానిక పార్క్ వీధి, శివాలయం వీధి, బ్రాహ్మణ వీధుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండల ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జి.ఎన్.భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ఆర్, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, సీనియర్ నాయకులు గణేష్ రెడ్డి, గుమ్మల్ల మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ టౌన్ కన్వీనర్ శ్రీనివాసరాజు, ఎర్రసాని నిరంజన్‌రెడ్డి, సర్పంచ్ కళ్యాణ్, విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి సాయికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యరాజు, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, నిత్య పూజయ్య, అన్వర్‌బాషా, అబ్దుల్‌రబ్, మునీర్ అహ్మద్, వారిస్, హస్రత్, సాదక్‌అలీ, జుమస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



గోళ్లపల్లెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : కుల మతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానిదేనని జేసీఎస్ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, డీసీఎంఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని జంభాపురం సచివాలయం పరిధిలోని గొల్లపల్లె, నేలతిమ్మాయపల్లె, జంభాపురం గ్రామాలలో వారు ఇంటింటికి తిరిగి జగనన్నకే ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు.

ప్రతి ఇంటి తలుపు తట్టి వా రికి ఈ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. దేశంలో ఏ రా ష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో మాత్రమే అమలు అవుతున్నాయన్నారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ప్రజలకు వివరించారు. ఈ పథకాలన్నీ తిరిగి రావాలంటే జగనన్నను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనువాసులరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఇతర నాయకులు రామకృష్ణారెడ్డి, గంగిరెడ్డి, సుబ్బారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సుధాకర్, విజయేంద్రారెడ్డి, రమణారెడ్డి, రాంబాబు, కుంచం శ్రీనివాసులరెడ్డి, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల పాలిట వరం పీఎం విశ్వకర్మ యోజన

వేంపల్లె : కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన ద్వారా సంప్రదాయ హస్తకళలను ప్రోత్సహించేందుకు ఆర్థిక మద్దతు అందిస్తోందని..అర్హత కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ తెలిపారు. గురువారం వేంపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ రూ.13వేల కోట్లతో పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. 18 రకాల అర్హత కలిగిన హస్తకళాకారులకు అండగా నిలుస్తూ తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. దేశాభివృద్ధికోసం మోదీ పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ రామచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు సుస్మా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రసాదు

పులివెందుల రూరల్ : పులివెందుల పరిసర ప్రాంతాలలో యాత్ర 2 సినిమా షూటింగ్ చేయడంతో పాటు ఈ ప్రాంత ప్రజలు అందులో నటించడంతో పులివెందులలో సంబరాలు చేసుకున్నారు. యాత్ర–2 సినిమా గురువారం దేశ వ్యాప్తంగా రీలీజ్ కావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు పులివెందులలోని భాకారాపురంలో ఉన్న వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం నుంచి భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మున్సిపల్ చైర్మన్ వరప్రసాదు, వైస్ చైర్మన్ హాఫీజ్‌లు ప్రారంభించారు. పట్టణంలోని కొత్త గింగిరెడ్డి హాస్పటల్, పాత బస్టాండ్, పూలఅంగళ్లు, ముద్దనూరు రోడ్డు, మారుతీహాలు రోడ్డు తదితర పురవీధుల్లో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వరప్రసాదు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అర్హులైన వారికి అందిస్తున్నారన్నారు. కొంత మంది రాజకీయ నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం లేనిపోని ఆరోణలు చేస్తున్నారన్నారు. వారి ఆరోపణలు తిప్పే కొట్టే విధంగా యాత్ర 2 వచ్చిందన్నారు. ఈ సినిమాతో ఇతర పార్టీలకు కనువిప్పు కలగాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్లు కిషోర్, చంద్రమౌళి, వైఎసార్‌సీపీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ శంకరరెడ్డి

పులివెందుల రూరల్ : జాతీయ భద్రత మాసోత్సవాల సందర్భంగా పట్టణంలోని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో గురువారం డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో అర్బన్ సీఐ శంకరరెడ్డి పాల్గొని మాట్లాడారు. డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చున్నారు. అనంతరం మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదు మాట్లాడుతూ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా వాహనాదారులకు రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాహనాదారులు తప్పని సరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. దూర ప్రాంతాలు వెళ్లే టప్పుడు హెల్మెట్, సీటు బెల్టులు ధరించాలన్నారు. కార్యాక్రమంలో ఎస్ఐ అరుణ్‌రెడ్డి, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్సవ విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీమిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం శివపార్వతుల ఉత్సవ విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా మొదటిరోజు గంగపూజ, గణపతి పూజ, అభిషేకాలు, గణపతి హోమాలను ఆలయ అర్చకులు రుద్రమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. విగ్రహాల దాతలు వెన్నపూస వేమారెడ్డి, శాంతమ్మల కుమారుడు మల్లికార్జునరెడ్డి, పవిత్రారెడ్డి దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నాలుగురోజులపాటు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు మల్లికార్జున, ఈఓ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వాహనాలను అడ్డుకున్న ప్రజలు



భారీ వాహనాలను అడ్డుకోవడానికి రోడ్డుపై మొద్దులను వేసిన స్థానిక ప్రజలు

ముద్దనూరు : స్థానిక డీఎన్‌పల్లె రహదారిలో భారీ వాహనాల రాకపోకలను అక్కడి స్థానిక గురువారం రోడ్డుకు అడ్డంగా మొద్దులు వేసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ ఆర్టీపీపీ నుంచి బూడిద లోడుతో తమ ఇళ్ళముందునుంచి నిత్యం వాహనాలు వెళుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారీ వాహనాలు అధిక లోడుతో తమ ఇరుకైన వీధిలో వెళ్తున్నాయని, ఈ వాహనాల వల్ల పిల్లలకు ప్రమాదం జరిగే అవకాశం వుందని, గతంలో కూడా భారీ వాహనాలు అదుపుతప్పి ఇళ్ళపైకి వచ్చిన సందర్భాలున్నాయని వారు వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి తమ వీధిగుండా భారీ వాహనాలు తిరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

జగనన్నతోనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయి



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

చింతకొమ్మదిన్నె : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు మళ్లీ అందాలంటే జగనన్నే మన రాష్ట్రానికి మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని బోడోద్దులపల్లి గ్రామంలో వారు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలంటే మనం ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ హిదాయతుల్లా, సర్పంచ్ కొత్తపల్లి రాజశేఖర్‌రెడ్డి, వద్దిరెడ్డి సురేంద్రరెడ్డి, ఎంపీటీసీ నారీ నాగరాజు వైఎస్ఆర్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల రూరల్ : పట్టణంలోని రింగ్ రో డ్డు సమీపంలో ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, సీడాఫ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఉచిత 90 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాక్ ఇన్‌చార్జి చెన్నకేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల యు వతీయవకులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నా రు. శిక్షణకు హాజరైన వారికి ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. అలాగే కావాల్సిన వారికి షూ, యూనిఫాం, ఉచితంగా అందచేస్తామన్నారు. ఆసక్తిగల వారు 18 ఎళ్ల నుంచి 34 ఎళ్ల వయస్సు ఉన్న వారు ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బిటెక్ డిగ్రీ, పీజీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. వివరాలకు 9985142155, 9989140993 నెంబర్లుకు కాల్ చేయాలన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఆర్డీఓ వెంకటేశులు

వేంపల్లె : అర్హులందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న లే అవుట్‌లోని లబ్ధిదారులకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను గురువారం ఆర్డీఓ వెంకటేశులు స్థానిక వైఎస్ మదీనపురంలో తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు మంజూరుతోపాటు ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని వాటిని లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అలాగే ఆయా సచివాలయ పరిధిల్లో లబ్ధిదారులకు ఈ రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తామని.. రాలేని పరిస్థితుల్లో ఉన్న లబ్ధిదారులకు నేరుగా వారి ఇంటి వద్దకే రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్నట్లు ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ లోకేష్, వీఆర్ఓలు, సచివాలయ ఉద్యోగులు, వార్డు సభ్యులు పాల్గొనానరు.

జాబ్‌డ్రైవ్‌కు స్పందన

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో గురువారం నిర్వహించిన మినీ జాబ్ డ్రైవ్‌కు చక్కటి స్పందన లభించింది. కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికల్లో ఫ్లిప్‌కార్ట్, ఆల్‌డిక్సన్, వైఎఫ్ఎంఎస్, క్వాస్‌కార్ప్ కంపెనీలు విచ్చేసి అభ్యర్థులను పలు ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నాయి. ఈ ఎంపికల్లో 131 మంది అభ్యర్థులు పాల్గొనగా 96 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ సి.హెచ్.రాము, మెంటార్లు సారథి, మంజుల, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కమిషనర్

పులివెందుల టౌన్ : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పులివెందుల మున్సిపాలిటీలోని పోలింగ్ కేంద్రాలను గురువారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పరిశీలించారు. స్థానిక ముద్దనూరురోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ స్టేషన్, పీఎస్ 72,73 లను పరిశీలించారు. అలాగే అక్కడ ఉన్న మౌలిక వసతులపై ఆరాతీశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నగర పంచాయతీకి రూ.31లక్షల ఆదాయం

జమ్మలమడుగు : నగర పంచాయతీకి వివిధ టెండర్ల ద్వారా రూ.31,55,320 ఆదాయం వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రమోద్‌కుమార్ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని సభాభవనంలో దినసరి కూరగాయాలు, బండ్లమెట్టు, బస్టాండ్ గేటు, కబేళ(మాంసం మార్కెట్)లకు టెండర్‌లను నిర్వహించారు. దినసరి కూరగాయాల మార్కెట్ రూ.14,13000 పోరెడ్డి మహేశ్వరరెడ్డి, బండ్ల మెట్ట రూ.4,55000కు షేక్ అమీర్, బస్టాండ్ గేటు(మోటారు స్టాండ్) రూ.5,88000 లకు రామలక్షుమ్మ, కబేళ 2,18000లకు షరిహున్నిసాలు దక్కించుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

మెస్ ప్రారంభం



భోజనం వడ్డిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం బాలికల వసతిగృహంలో నూతన మెస్ డైనింగ్ హాల్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలసి గురువారం ప్రారంభించారు. వసతిగృహంలో 600 మంది విద్యార్థినులు ఉండగా వారి సౌకర్యార్థం మరొక నూతన మెస్‌ను 300 మంది విద్యార్థినులు కూర్చుని భోజనం చేసేలా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ చక్కగా చదువుకుని తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు.

న్యాయ సహాయం అందించాలి



పులివెందుల కోర్టులో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్: బాల నేరస్తులకు న్యాయ సహాయం అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. పాన్ ఇండియా ప్రచారంలో భాగంగా ఆయన పులివెందుల సబ్‌జైలును సిబ్బందితో కలసి సందర్శించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ జైళ్లలో ఉన్న బాలనేరస్తులను గుర్తించి వారికి న్యాయ సహాయం అందించడం ఈ ప్రచారం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పులివెందుల కోర్టును సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఈనెల 9న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జైలు సూపరింటెండెంట్, పోలీసు అధికారులు, ప్యానల్ న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుళ్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా లింగమయ్యస్వామి తిరునాల

కొండాపురం : మండలంలోని చౌటిపల్లె గ్రామంలో లింగమయ్యస్వామి తిరునాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ తిరునాలలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనాథరెడ్డి, సుకుమార్‌రెడ్డి, లింగేశ్వర్‌రెడ్డి, మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు – కారు ఢీ

–ఒకరికి తీవ్రగాయాలు

ముద్దనూరు: మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో గురువారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.

స్థానికుల సమాచారం మేరకు ఎర్రగుంట్లకు చెందిన రామకృష్ణారెడ్డి అనే వ్యక్తి కారులో తాడిపత్రి వైపు నుంచి వస్తున్నాడు. ఎదురుగా తాడిపత్రికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఓబుళాపురం సమీపంలో ఢీకొంది. ఈ ఘటనలో రామకృష్ణారెడ్డి తలకు గాయమవడంతో 108 వాహనంలో తాడిపత్రిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కారులోని ఎయిర్‌బెలూన్‌లు తెరుచుకోవడంతో ప్రమాదం తప్పినట్లు సమాచారం. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జయింది.